ఆన్‌లైన్ మోసాలకు గురికావొద్దు



సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఐ

కొల్లాపూర్: విద్యార్థులు, యువత ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని కొల్లాపూర్ ఎస్‌ఐ హృషికేష్ సూచించారు. శనివారం కొల్లాపూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రామిక వికాస కేంద్రం, చిల్డ్రన్స్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ఆన్‌లైన్ సేఫ్టీ మరియు పిల్లల లైంగిక దోపిడీ' అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఎస్‌ఐతో పాటు, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వై.లక్ష్మణ్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ మాట్లాడారు. ఆన్‌లైన్‌లో జరిగే మోసాల గురించి వివరించారు. సెల్‌ఫోన్లలో వచ్చే అశ్లీల వీడియోలకు దూరంగా ఉండాలని సూచించారు. శారీరకంగా, మానసికంగా మనిషి ఔన్నత్యాన్ని ఇవి దెబ్బతీస్తాయన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే 100, 1098, 1930 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వివరించారు.

ఎండిన పంటల పరిశీలన


కొత్తకుంటపల్లి శివారులో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ నాగార్జునరెడ్డి

లింగాల: మండలంలోని ఆయా గ్రామాల్లో యాసంగిలో సాగు చేసిన వివిధ రకాల పంటలను మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడారు. మండలంలో యాసంగిలో 2,680 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలను సాగు చేశారని ఏఓ తెలిపారు. గత వానా కాలంలో తక్కువ వర్షపాతం నమోదు కావడంతో బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి పోయాయని, కాల్వల ద్వారా నీటి విడుదల ఆగిపోవడంతో 150 నుంచి 200 ఎకరాల మేర వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోయినట్లు తెలిపారు. ఈ సమయంలో పంటల దిగుబడి తగ్గే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నీటి లభ్యతను బట్టి పంటలను సాగు చేయకపోవడంతో రైతులు నష్టాలకు గురికావాల్సి వస్తుందన్నారు. వేసవిలో ఆలోచన చేసి పంటలను సాగుచేస్తే మంచిదని తెలియజేశారు.

క్లుప్తంగా

వృద్ధులకు వైద్య పరీక్షలు



తెలకపల్లి: మండల పరిధిలోని పర్వతాపూర్‌లో శనివారం వృద్ధులకు వైద్య సేవలు అందించారు. రెడ్‌క్రాస్ సంచార వైద్య సేవల్లో భాగంగా పర్వతాపూర్‌కు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంచార సేవలు అందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. సొసైటీ ఆధ్వర్యంలో అనేక గ్రామాల్లో వృద్ధులకు వారి ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. శిబిరంలో 94 మంది వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. రమేష్‌రెడ్డితో పాటు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ డి.కుమార్, ఏఎన్‌ఎం శారద, ఆశా కార్యకర్త అలివేలు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు

కల్వకుర్తి టౌన్: సీఎంను కల్వకుర్తి కాంగ్రెస్ నాయకులు ఆయన నివాసంలో శనివారం కలిశారు. ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావటం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, శంకర్ నాయక్, ముత్యాల్ రెడ్డి, పాండు రంగారెడ్డిలు ఉన్నారు.

28న బహిరంగ వేలం

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతా రామచంద్రస్వామి దేవాలయంలో శ్రీరామనవమి సందర్భంగా బ్రహ్మోత్సవాలకు ఈ నెల 28న మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ ఆవరణలో స్వామివారి కల్యాణ మండపంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో కొబ్బరికాయలు, తలానీలాలు, కొబ్బరి ముక్కలు, లడ్డూ, పులిహోర ప్రసాదాలు అమ్ముకునేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ దేరం రామశర్మ, ఈఓ రఘు, మేనేజర్ నిరంజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు కొబ్బరికాయలకు రూ.5 లక్షలు, తలానీలాలకు రూ.లక్ష, కొబ్బరి ముక్కలకు రూ.50 వేలు, లడ్డూ, పులిహోరకు రూ.2 లక్షలు డిపాజిట్ డీడీగాని, నగదు చెల్లించాలని సూచించారు. వేలం దారులు పాట పూర్తి కాగానే 75 శాతం చెల్లించాలని, మిగతావి రూ.48 గంటలో చెల్లించాలన్నారు. నిర్ణీత సమయంలో వేలం డబ్బులు చెల్లించకుంటే వేలం రద్దు చేసి తిరిగి వేలం వేస్తామని ఆలయ చైర్మన్, ఈఓ పేర్కొన్నారు. వేలంలో దేవాలయ సిబ్బంది, దేవాలయ సంబంధిత వ్యక్తులు, గత వేలంలో బకాయి ఉన్నవారు వేలంలో పాల్గొనరాదని తెలియజేశారు. లడ్డూ, పులిహోర ప్రసాదం వేలంలో బ్రాహ్మణులు మాత్రమే పాల్గొనాలని సూచించారు.

చెక్కు పంపిణీ

కోడేరు: మండల కేంద్రానికి చెందిన వడ్డె వల్లెపు స్వామికి ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మాజీ వార్డు సభ్యురాలు కొమ్మిరే రాధ రూ.16,200లను ఆ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో రామ్‌లక్ష్మణ్, రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆలయ పనులు ప్రారంభం

ఊర్కొండ: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ స్లాబ్ నిర్మాణ పనులకు శనివారం బీజేపీ రాష్ట్ర నాయకులు, నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. వీలైనంత త్వరగా పనులు నాణ్యతగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

తీగలు తగిలి గడ్డి దగ్ధం

ఊర్కొండ: వరిగడ్డి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగలడంతో దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మాదారానికి చెందిన సిద్దేశ్ లక్ష్మయ్య శనివారం ట్రాక్టర్‌లో వరిగడ్డిని తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో పైనున్న విద్యుత్ తీగలకు వరిగడ్డి తగలడంతో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయాయి. అటుగా వెళ్తున్న బ్లూ కోల్ట్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుళ్లు మల్లేష్, హర్ష స్పందించి జేసీబీ, వాటర్ ట్యాంకర్ సాయంతో గంటపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

ఇద్దరికి గాయాలు

ఉప్పునుంతల: ఉప్పునుంతల– అచ్చంపేట రహదారిలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట శనివారం రాత్రి ఎదురెదురుగా వెళ్తున్న రెండు బైక్‌లు ఢీకొని కాంసానిపల్లి తండాకు చెందిన శివ, నడింపల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సారా పట్టివేత

పెద్దకొత్తపల్లి: చంద్రబండ తండా నుంచి అక్రమంగా 8 లీటర్ల సారాను తరలిస్తున్న వ్యక్తిని నాగర్‌కర్నూల్ డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ కొల్లాపూర్ ఎక్సైజ్ సిబ్బంది శనివారం పట్టుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు కొల్లాపూర్ సీఐ నాగిరెడ్డి తెలిపారు. చంద్రబండ తండా నుంచి తెల్లవారుజామున సారాను బైక్‌పై అక్రమంగా తరలిస్తున్నాడు. మారేడుదిన్నె స్టేజ్ వద్ద కాపు కాసిన ఎక్సైజ్ సిబ్బంది, బైక్‌ను సోదా చేయగా 8 లీటర్ల సారా లభించింది. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. గ్రామాల్లో సారాను విక్రయించినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. దాడుల్లో జిల్లా ఎక్సైజ్ అధికారి కళ్యాణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో హోలీ సంబరాలు


హోలీ వేడుకల్లో చిన్నారులు


మేడిపూర్ పాఠశాలలో హోలీ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో శనివారం విద్యార్థులు హోలీ సంబరాలను సెలవు కారణంగా ఒక రోజు ముందుగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు హోలీ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ప్రతి యేటా మార్చ్ నెలలో హోలీ సంబరాలు నిర్వహించుకుంటామని వసంత కాలం ఆరంభం కావడంతో చెట్ల ఆకులు రాలి కొత్త ఆకులు చిగురిస్తాయని అన్నారు. అందరి కోరికలు చిగురించాలనే ఉద్దేశంతో హోలీ సంబరాలను జరుపుకొంటామని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, సాయిప్రభ, ఆనంద్, అర్జున్ తదితరులు తెలియజేశారు.

ఏషియన్ డైమండ్ స్కూల్‌లో..

కొల్లాపూర్: పట్టణంలోని ఏషియన్ డైమండ్ స్కూల్‌లో శనివారం హోలీ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని ముందస్తుగా హోలీ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. హోలీ పర్వదిన విశిష్టతను పాఠశాల ప్రిన్సిపాల్ క్యాథరిన్ విద్యార్థులకు వివరించారు. సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ, ఉన్నత లక్ష్యాల సాధన దిశగా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

పాఠశాల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాములు

బిజినేపల్లి: విద్యార్థులకు మధ్యాహ్న అందించే భోజనంలో నాణ్యత పాటించాలని తహసీల్దార్ రాములు సూచించారు. కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన విద్యార్థుల విద్యా సామర్థ్యాలు, భోజన నాణ్యతను పాటించారు. కాసేపు విద్యార్థులతో ముచ్చటించి వారి లక్ష్యాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండాలలో హుండీ లెక్కింపు


గుండాల దేవాలయంలో హుండీ లెక్కిస్తున్న అధికారులు

వెల్దండ: మండల పరిధిలోని గుండాలలో అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శనివారం హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఉత్సవాలు ముగిసిన సందర్భంగా హుండీని లెక్కిస్తున్నట్లు పేర్కొన్నారు. హుండీ ఆదాయం రూ.2.54 లక్షలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓ ప్రసాద్, సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు తదితరులు ఉన్నారు.

మామిడి చెట్లు ధ్వంసం


ధ్వంసమైన చెట్లు

కోడేరు: మండలంలోని ఎత్తంలో గుర్తు తెలియని వ్యక్తులు మామిడి చెట్లను ధ్వంసం చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి ఎత్తంకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి నాలుగు సంవత్సరాల కిందట తనకున్న వ్యవసాయ పొలంలో 3 ఎకారాల్లో మామిడి తోట సాగు చేశాడు. శుక్రవారం అర్ధ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పొలంలోకి ప్రవేశించి 24 మామిడి చెట్లను ధ్వంసం చేశారు. బాధితుడు శనివారం పొలం వద్దకు వెళ్లి చూడగా.. చెట్లు అన్ని ధ్వంసమయ్యాయి. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలియజేశారు.

తండ్రాని సందర్శించిన ఎంపీడీఓ


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కల్వకుర్తి రూరల్: మండలంలోని తండ్రాని శనివారం ఎంపీడీఓ వెంకట్‌రాములు సందర్శించారు. మొదటగా గ్రామంలోని పాఠశాలకు వెళ్లి విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. నర్సరీలోని మొక్కలను పరిశీలించి గ్రామపంచాయతీలో రికార్డులను చూశారు. వేసవిలో సమస్యలు లేకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి ఎంపీడీఓ ఆదేశాలు జారీ చేశారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

కల్వకుర్తి రూరల్: చదువులో చురుకుగా ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్న పేద విద్యార్థి చదువుకు క్లాస్‌మేట్ క్లబ్ వాసవీ క్లబ్‌లు అండగా నిలిచాయి. కల్వకుర్తి పట్టణానికి చెందిన అరుణ్‌కుమార్ డిగ్రీ విద్యార్థికి శనివారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. వాసవీక్లబ్ రీజినల్ సెక్రెటరీ జూలూరి సత్యం సహకారంతో విద్యార్థికి అండగా నిలిచారు. ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ఎల్లప్పుడు సహాయ, సహకారాలు అందిస్తామని తెలియజేశారు. రాఘవేందర్, కల్మిచర్ల రమేష్, హరి కృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

రోడ్డుపక్కన మొక్కలను సంరక్షించాలి


రోడ్డు పక్కల చెట్లకు నీటిని అందిస్తున్న పొల్మూరు పంచాయతీ సిబ్బంది

తాడూరు: తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్డుకు ఇరువైపుల నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్ కోరారు. శుక్రవారం మండలంలోని పోల్మూరు, గుట్టలపల్లి, మేడిపూర్ గ్రామాలను సందర్శించిన ఆయన రోడ్డు వెంట వెళ్తూ.. నీరు లేక ఎండిపోతున్న మొక్కలను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రసహాయకులను అప్రమత్తం చేశారు. స్పందించిన అధికారులు మేడిపూరు నుంచి పొల్మూరుకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు.

అంగన్‌వాడీ వర్కర్ల తొలగింపుపై ఆందోళన

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడారు. అక్రమంగా విధుల్లో నుంచి తొలగించిన చింతలపల్లి గ్రామ అంగన్‌వాడీ టీచర్లు భారతి, సుగుణలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ కక్షలతో అంగన్‌వాడీ వర్కర్లను తొలగించడం సరైంది కాదన్నారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్ల సంఘం నాయకురాళ్లు సాయిలీల, నిర్మల, లక్ష్మీ, హుస్సేనమ్మ, ఈశ్వరమ్మ, సులోచన, వెంకటమ్మ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



కొండనాగులలో ఓటు హక్కుపై అవగాహన

బల్మూర్: మండంలోని కొండనాగులలో శనివారం ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ వారిచే ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పరంగి రవి మాట్లాడారు. ఓటు హక్కు ప్రజల చేతుల్లో వజ్రాయుధం లాంటిదని, అందరూ సక్రమంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక వాహనాలు పట్టివేత

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని రాళ్ల చెరువుతండా నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక టిప్పర్, మూడు ట్రాక్టర్లను పట్టికొని కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి అనుమతులు లేని వాహనాలు పట్టుబడ్డాయి. వెంటనే ఆ వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసి సీజ్ చేశారు.

భగత్‌సింగ్ ఆశయాలు కొనసాగిస్తాం..


కొల్లాపూర్‌లో నివాళి అర్పిస్తున్న విద్యార్థి సం


నాగర్‌కర్నూల్‌లో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా కాగడాలతో నివాళి అర్పిస్తున్న నాయకులు


తెలకపల్లిలో నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు


అచ్చంపేటలో నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

కొల్లాపూర్/ అచ్చంపేట రూరల్/ కల్వకుర్తిరూరల్/ తెలకపల్లి/ పెంట్లవెల్లి/ వెల్దండ/ కోడేరు/ తాడూరు/ బల్మూర్: అరాచకాలు, అన్యాయాలకు వ్యతిరేఖంగా విద్యార్థులు పోరాడాలని డీవైఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు మైమూద్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 93వ వర్ధంతిని శనివారం మండల కేంద్రంలో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు.

- తెలకపల్లి మండల కేంద్రలోని నెహ్రూ చౌరస్తాలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి నందిపేట భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.
- తాడూరు డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భగత్‌సింగ్‌కు నివాళి అర్పించారు.
- భగత్‌సింగ్ ఆశయాలు కొనసాగిస్తామని విద్యార్థి సంఘాల నాయకులు, వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. శనివారం కొల్లాపూర్‌లో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. డి.శేఖర్, బి.దాసు, అశోక్‌నాయక్ పాల్గొన్నారు.
- విప్లవ వీరుడు భగత్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని అచ్చంపేటలో వివిధ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పాఠశాలలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు.

మతోన్మాద పార్టీలను ఓడిద్దాం

నాగర్‌కర్నూల్ రూరల్: భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో మతోన్మాద శక్తులను ఓడిద్దామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల్‌నర్సింహ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగులను మోసం చేసిన మోదీని ఈ ఎన్నికల్లో ఓడిద్దామని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ నాయకులు మారేడు శివశంకర్, తన్నీరు నర్సింహ, కేశవులు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి


విద్యార్థులు ప్రదర్శిస్తున్న కళాప్రదర్శన

తెలకపల్లి: విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రిటైర్డ్ ఆర్‌జేడీ ఏ.శ్రీరాములు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేకేరెడ్డి పాఠశాల వార్షికోత్సవం శివగంగా పంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలంటే విద్యార్థులు ఉన్నతంగా చదవాలన్నారు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధగా వింటే అనుకున్న లక్ష్యాలకు పయనిస్తారన్నారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి చూపరులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆ పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి, అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల సలహాదారుడు రఘురాంరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రభాకర్, బాలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో బీసీ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఇందిరమ్మ బీసీ కాలనీలో ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన సీసీరోడ్డు పనులను మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ దండు నర్సింహ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇందిరమ్మ కాలనీలో సీసీరోడ్లు లేకపోవడంతో కాలనీవాసులు వర్షాకాలంలో బురదతో ఇబ్బందులు ఎదుర్కొనే వారని, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడంతో ప్రజల ఇబ్బందులు తొలిగాయని అన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి ఎమ్మెల్యేల సన్మానం


సన్మానం చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న డాక్టర్ వంశీకృష్ణ కాంగ్రెస్ నాయకులు

కల్వకుర్తి: కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న మల్లురవిని శనివారం హైదరాబాద్‌లోని కల్వకుర్తి ఎమ్మెల్యే గృహంలో కల్వకుర్తి, అచ్చంపేట ఎమ్మెల్యేలు శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ మాట్లాడుతూ.. భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు.

మల్లురవి ఎంపికపై హర్షం

మన్ననూర్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ మల్లురవిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎంపిక చేయడంపై ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోరె రేణయ్య సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఆయన ఇంటికి వెళ్లి శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. గత శాసన సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు పనిచేసినట్లుగానే పనిచేసి మల్లురవిని నాగర్‌కర్నూల్ ఎంపిగా గెలిపించుకునేందుకు శాయశక్తుల కృషి చేస్తామని అన్నారు. మల్లు రవిని కలిసిన వారిలో డీసీసీ కార్యదర్శులు కిన్నెర పాండు, అంబనారాయణ ఉన్నారు.

దేవాలయంలో ప్రత్యేక పూజలు

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సింగోటంలో వెలిసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ మల్లురవికి కేటాయించడం హర్షించ దగ్గ విషయమని స్థానిక కాంగ్రెస్ నాయకులు లక్ష్మీనరసింహుడుని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. మల్లురవి గెలుపునకు అందరం పని చేయాలన్నారు. రంగినేని జగదీశ్వరుడు, పరశురాం, కిరణ్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ


పెద్దకొత్తపల్లిలో 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఈసుప్‌అలీ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని 10వ తరగతి పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ ఈసుఫ్‌అలీ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరీక్షల్లో విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడకుండా ఇన్విజిలేటర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు పరీక్షల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని చీఫ్ సూపరింటెండెంట్‌కు సూచించారు. విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించాలని తెలియజేశారు.

మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శిగా చింతసత్తి



తాడూరు: మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన చింతసత్తి ఎంపికయ్యారు. శనివారం హైదరాబాద్ గట్టేశ్వర్ అంబేద్కర్ భవనంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్ నియామక పత్రాన్ని అందజేశాడన్నారు. మాలమహానాడు జాతిని ఏకం చేయడంతో పాటు పేద ప్రజల సహాయ సహకారాలు, రాష్ట్ర స్థాయి నాయకులు సహకారంతో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు రమేష్, వెంకటస్వామి పాల్గొన్నారు.

అంబులెన్సులో ప్రసవం: తల్లీ బిడ్డ క్షేమం

వంగూర్: మండల పరిధిలోని డిండి చింతపల్లికి చెందిన అఖిలకు పురిటి నొప్పులు రావడంతో శనివారం 108 అంబున్స్‌కు కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. వెంటనే అంబులెన్స్ సిబ్బంది వాహనంలో అక్కడికి చేరుకుని అఖిలను హాస్పిటల్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యంలోనే పురిటి నొప్పులు అధికమయ్యాయి. సిబ్బంది అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని, తదుపరి వైద్యం నిమిత్తం ఇరువురిని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.